నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 1 ఫిబ్రవరి 2025 | NIZAMABAD

- నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటనలపై సర్వత్రా ఆసక్తి
- ఉమ్మడి జిల్లాకు కేటాయింపులపై ఉత్కంఠ
- ఇటీవలే పసుపుబోర్డు ఏర్పాటు.. పైసా ఇవ్వని కేంద్రం
- బడ్జెట్‌లో కేటాయింపులపై రైతుల ఆశలు
- తాయిలాల కోసం సామాన్యుల ఎదురుచూపులు
- రైల్వే అభివృద్ధిపైనా ఉమ్మడి జిల్లా వాసుల గంపెడాశలు
- ఆదాయ పన్ను మినహాయింపు కోరుతున్న వేతన జీవులు

**బోర్డు సరే.. విధి విధానాలేవి?**

కేంద్ర సర్కారు తీరుపై పసుపు రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2019 ఎన్నికల్లో పసుపుబోర్డు ఏర్పాటుపై హామీలిచ్చి ఐదున్నరేండ్ల పాటు కాలక్షేపం చేశారు. పూటకో మాట మాట్లాడి పసుపు రైతులను గందరగోళంలో పడేశారు. 2023లో ప్రధాని మోదీ స్వయంగా పసుపుబోర్డు ఏర్పాటుపై ప్రకటన చేయగా, మొన్న జనవరి 14న నిజామాబాద్‌లో పసుపుబోర్డును ఏర్పాటు చేసినట్లు బీజేపీ ఎంపీ అర్వింద్ ప్రకటించారు. ఎక్కడా అంగుళం భూమి సేకరించలేదు. కార్యాలయం కూడా లేనే లేదు. అయినప్పటికీ ప్రైవేటు హోటల్‌లో పసుపుబోర్డు ప్రారంభోత్సవాన్ని నిర్వహించి చేతులు దులుపుకున్నారు. నిజామాబాద్‌లో బోర్డు ఏర్పాటు కావాలంటే, రైతుల ఆకాంక్షలకు తుది రూపం దక్కాలంటే కేంద్రం నుంచి నిధులు రావాలి. ఈ నేపథ్యంలోనే నేడు కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో పసుపుబోర్డుకు నిధులిస్తారా.. లేదా? అన్నది సర్వత్రా ఆసక్తిగా మారింది. బోర్డు కార్యకలాపాలు జరగాలంటే కేంద్ర సర్కారు సహకారం తప్పనిసరి. అలాంటప్పుడు కేంద్ర బడ్జెట్‌లో ఈ అంశం ప్రస్తావనకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. పసుపు బోర్డు విధివిధానాలపై ఇప్పటి వరకు కేంద్రం స్పష్టమైన ప్రకటనే చేయలేదు. కానీ బోర్డు చైర్మన్‌ను మాత్రం నియమించి మమ అనిపించింది.

# సీతమ్మ.. కరుణించేనా?



## పసుపుబోర్డుకు పైసలిచ్చేనా?

నిజామాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ ప్రతినిధి)



**కేంద్ర బడ్జెట్‌పై** ఉమ్మడి జిల్లా ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి వచ్చే ప్రకటనలపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రధానంగా పసుపుబోర్డుకు నిధుల కేటాయింపు, రైల్వే లైన్ల అభివృద్ధికి సీతమ్మ ఏ మేరకు కరుణ చూపుతారన్నది ఆసక్తిగా మారింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలో రైల్వే లైన్ల అభివృద్ధి అంతంత మాత్రంగానే జరుగుతున్నది. పూర్తి స్థాయిలో రైల్వే లైన్ ఎలక్ట్రిఫికేషన్ చేసినప్పటికీ, డబ్లింగ్ పై నిర్మలమ్మ ప్రతి బడ్జెట్‌లోనూ నిరాశే కలిగిస్తున్నది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా డబ్లింగ్ ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నా, ఉమ్మడి జిల్లాపై మాత్రం కేంద్రం వివక్ష చూపుతున్నది. ఇక, పదేండ్లు పట్టించుకోని పసుపుబోర్డును మొన్న సంక్రాంతి రోజున హడావుడిగా ప్రారంభించిన కేంద్రం.. పైసా ఇవ్వలేదు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు, పసుపుబోర్డు కార్యరూపం దాల్చితే పసుపు ఎగుమతుల కోసం రైల్వే లైన్ల అభివృద్ధి ఎంతో కీలకం కానున్నది. ఈ తరుణంలో బీజేపీ నేతలు డబ్లింగ్ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు. ధర్మపురి అర్వింద్ రెండుసార్లు ఎంపీగా ఉన్నప్పటికీ నిజామాబాద్ ప్రాంతానికి ప్రత్యేకంగా చేసిన మేలు మాత్రం శూన్యమే. కనీసం రైల్వే డబ్లింగ్, పసుపుబోర్డుకు నిధులు తేవడం, బోర్డు కార్యకలాపాలు ప్రారంభించి రైతులకు మేలు చేసేలా చూడాల్సిన బాధ్యత ఎంపీపై ఉన్నది.

### డబ్లింగ్‌పై దృష్టి పెట్టేనా?


నిజామాబాద్ ప్రాంతం హైదరాబాద్‌కు దాదాపుగా 160 కిలో మీటర్ల దూరంలో ఉంది. రాష్ట్ర రాజధానికి వెళ్లాలంటే బస్సులో, సొంత వాహనాల్లో చేరడం వ్యయ, ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. రైలు ప్రయాణమైతే తక్కువ ఖర్చులోనే చేరుకునే వెసులుబాటు ఉంది. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా రైల్వేలు విస్తరిస్తున్నప్పటికీ ఈ ప్రాంతంపై అటు కేంద్రం, ఇటు రైల్వే శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నది. డబ్లింగ్ చర్యలకు నాంది పలకడం లేదు. నిజామాబాద్ మీదుగా ముంబై, హైదరాబాద్ మార్గాలను వాణిజ్య అవసరాలకే దక్షిణ మధ్య రైల్వే వాడుకుంటున్నది. ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్లుగా రైళ్లను తిప్పడం లేదు. సింగిల్ లైన్ ఉండడం ప్రతిబంధకంగా మారింది. డబ్లింగ్ వేయడం ద్వారా గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు ఎలాంటి అవరోధాలూ ఉండవు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి బీజేపీ ఎంపీలే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, ప్రజల ఆశలు నెరవేరడం లేదు. డబ్లింగ్‌పై నిజామాబాద్ ఎంపీకి పలు సంఘాలు, ప్రజలు ఎన్నోసార్లు విన్నవించారు. కానీ అర్వింద్ ఏనాడూ పట్టించుకోలేదు. రైల్వే అభివృద్ధి అన్నది కాలానికి తగ్గట్లుగా ఎలక్ట్రిఫికేషన్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ జరిగి పోతున్నది తప్పితే లోక్‌సభ సభ్యుల చొరవ మాత్రం ఉండడం లేదు. పసుపుబోర్డును తామే తెచ్చామని బీజేపీ చెబుతున్న నేపథ్యంలో డబ్లింగ్ సమస్య కూడా తీర్చి తమకు మేలు చేయాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

---

# ‘ఖాకీ’లో నిస్తేజం!

**కమిషనరేట్‌లో గందరగోళం**

- బోధన్ డివిజన్‌లో అయోమయం
- వరుస సెలవుల్లో ఎడపల్లి, రెంజల్ ఎస్సైలు
- వ్యక్తిగతమా లేదా రాజకీయ, ఉన్నతాధికారుల ఒత్తిళ్లే కారణమా!
- చర్చనీయాంశమైన అంతుచిక్కని వ్యవహారాలు
- నాలుగు నెలలుగా నిజామాబాద్ సీపీ పోస్టు ఖాళీ
- పైరవీల కారణంగా నిలిచిపోయిన కొత్తవారికి పోస్టింగ్‌లు



నిజామాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సమాజరక్షణకు నిత్యం పాటుపడుతూ, క్రమశిక్షణకు చిరునామాగా ఉన్న పోలీసుశాఖ కొద్దిరోజులుగా అపఖ్యాతిని మూటగట్టుకుంటున్నది. కొంతమంది అడ్డదారులు తొక్కి పోలీసుశాఖకు చెడ్డపేరు తీసుకువస్తున్నారు. ఏసీబీ దాడులతో కొందరి అవినీతి బాగోతం బట్టబయలు కావడం, ఉన్నతాధికారులకు ఇబ్బందిగా మారింది. నిజామాబాద్ కమిషనరేట్‌లో కొన్నిరోజులుగా ఏం జరుగుతున్నదో తెలియని పరిస్థితి నెలకొన్నది. కొన్నిరోజుల క్రితం వేల్పూర్ ఎస్సై అటాచ్‌మెంట్, నిజామాబాద్ నగరంలో ఇద్దరు ఎస్సైలను తప్పించడం, తాజాగా బోధన్ డివిజన్‌లో మరో ఇద్దరు ఎస్సైలు సెలవులపై వెళ్లడం కలకలం రేపుతున్నది. ఎడపల్లి, రెంజల్ ఎస్సైల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరూ దీర్ఘకాలిక సెలవులు పెట్టి ఠాణాల నుంచి తప్పుకోవడంపై ఆసక్తి నెలకొన్నది. ఒకే డివిజన్, ఒకే సర్కిల్ పరిధిలోని రెండు పక్క పక్క మండలాలకు చెందిన ఎస్సైలు ఒకరి తర్వాత మరొకరు సెలవులపై వెళ్లిపోవడం విస్మయానికి గురిచేస్తున్నది. ఆరోగ్య సమస్యలతో విధులకు దూరం అవుతున్నట్లు ఎస్సైలు అధికారికంగా చెబుతున్నప్పటికీ, తెర వెనుక రాజకీయ నేతల ఒత్తిడి కారణమా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాలతో విధుల నుంచి తప్పుకున్నారా? అనే చర్చ నడుస్తోంది. సెలవులపై వెళ్లిన ఎస్సైల స్థానంలో కొత్త వారికి పోస్టింగ్‌లు కూడా ఇవ్వలేదు. సీఐలకు బాధ్యతలు అప్పగించి ఠాణాలను నడిపిస్తున్నారు. ఎస్సైలుగా పోస్టింగ్ ఇచ్చేందుకు పూర్తి స్థాయి సీపీ లేకపోవడంతోపాటు రాజకీయ పైరవీలు బలంగా ఉన్నాయనే కారణాలు కనిపిస్తున్నాయి.

### ఉన్నతాధికారులకు తలవంపులు

రెంజల్ ఠాణాలో ఓ గిరిజన రైతు అనుమానాస్పద మృతితోపాటు కామారెడ్డిలో టేక్రియాల్(అడ్లూర్ ఎల్లారెడ్డి) పెద్ద చెరువులో ఎస్సై, కానిస్టేబుల్, మరో యువకుడి ఆత్మహత్య ఘటనలు సంచలనం రేకెత్తిస్తున్నాయి. నెలలు గడుస్తున్నా ఈ వ్యవహారం ఇంకా కొలిక్కిరాలేదు. మరోవైపు పూటకొకరు ఏసీబీకి చిక్కుతుండడంతో పోలీస్ శాఖ పరువు మంటగలుస్తున్నది. కింది స్థాయిలో పోలీసుల అక్రమాలు, అవినీతి కేసులు, మానవ హక్కుల సంఘాల నుంచి నోటీసులు, లోకాయుక్తా నుంచి పిలుపు వంటివి ఉన్నతాధికారులకు తలవంపులు తీసుకువస్తున్నాయి. నిజామాబాద్‌లో ఓ ఉన్నతాధికారి స్వయంగా భూ లావాదేవీల్లో పాత్రధారుడిగా మారి సెటిల్మెంట్లకు పాల్పడుతుండడం తీవ్ర దుమారం రేపుతోంది.

### ఠాణాల్లో ఇష్టారాజ్యం..

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్వాల్ కరువయ్యారు. నాలుగు నెలలుగా సీపీ లేకపోవడంతో పాలన గాడి తప్పింది. సీపీ బదిలీపై వెళ్లిన కొద్ది రోజులకే వర్నిలో ఎస్సై కృష్ణ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కాడు. ఆ తర్వాత పలుచోట్ల ఠాణాలను అడ్డాగా చేసుకుని దందాలు, సెటిల్మెంట్లు, ఇసుక వ్యాపారులతో ములాఖత్‌లతో ఖాకీల ఇష్టారాజ్యం పెరిగింది. అడిషనల్ డీసీపీ హోదాలో బస్వారెడ్డి ఉన్నప్పటికీ ఇన్‌చార్జి సీపీ ఆదేశాల మేరకు పని చేస్తున్నారు. ఇన్‌చార్జి సీపీ కామారెడ్డి జిల్లా పరిపాలనలో ఉన్నప్పుడు అడిషినల్ డీసీపీ ఇక్కడి వ్యవహారాలను చూసుకుంటున్నారు. కీలకమైన నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రస్తుతం అడిషనల్ డీసీపీ(లా అండ్ ఆర్డర్ ) పోస్టు ఖాళీగానే ఉంది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లేడు. టాస్క్‌ఫోర్స్‌లో ఒక సీఐ ఉన్నప్పటికీ మరో సీఐ రావాల్సి ఉంది. కింది స్థాయిలో సిబ్బంది నియామకం చేపట్టలేదు. ఇన్‌చార్జి సీపీగా సీపీగా, కామారెడ్డి ఎస్పీగా సింధూ శర్మ రెండు బాధ్యతలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది.

### ఇరుక్కుపోతున్న ఖాకీలు...

నిజామాబాద్ సీపీగా కల్మేశ్వర్ సింగెనవార్ ఉన్నప్పుడు ఖాకీలు భయంతో పని చేశారు. కేంద్ర సర్వీసులకు బదిలీపై కల్మేశ్వర్ వెళ్లి నాలుగు నెలలు గడిచినప్పటికీ ఇంత వరకూ కొత్త అధికారిని ప్రభుత్వం నియమించలేదు. వ్యక్తిగత కారణాలతో కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ సైతం ఇప్పటికే ఉన్నతాధికారులకు బదిలీ దరఖాస్తు సమర్పించారు. ఓవైపు ఎస్పీగా, మరోవైపు ఇన్‌చార్జి సీపీగా రెండు జిల్లాల్లో తలామునకలవుతుండగా, కింది స్థాయిలో కొంత మంది ఖాకీలు అదుపు తప్పి ప్రవర్తిస్తుండడం ఇబ్బందిగా మారింది. స్వయంగా డీజీపీ జితేంద్రప్రసాద్ రంగంలోకి దిగి ఇసుక అక్రమాల్లో తలదూర్చకూడదని చెబుతున్నప్పటికీ బాన్సువాడ డివిజన్‌లో ఓ అధికారితో సహా పలువురు సీఐలు, ఎస్సైలు చెలరేగిపోతున్నారు. ఎమ్మెల్యే అండదండలతో పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలనే బేఖాతరు చేస్తున్నారు. దీంతో వరుసగా మూడు నెలల క్రితం వర్ని ఎస్సై కృష్ణ, ఆ తర్వాత లింగపేటలో ఎస్సై అరుణ్ కుమార్, మొన్న ఎస్సై సుధాకర్ లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కడం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పోలీసుల పని తీరును ప్రస్ఫుటం చేస్తున్నది. ఏసీబీ వరుస దాడుల ఘటనలతో కాసులిస్తే కానీ ఠాణాల్లో పని జరగదనే చందంగా మారింది.

---

# ఇద్దరు విద్యార్థినులు.. ఒక ఉపాధ్యాయురాలు

- ఏజెన్సీ నిర్వాహకురాలి ఇంటి నుంచే మధ్యాహ్న భోజనం
- నిరుపయోగంగా కిచెన్, స్టోర్ గదులు
- హాజీపూర్ సడాక్‌తండా పాఠశాలలో వింత పరిస్థితి

*సర్కార్ బడులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా, సత్ఫలితాలు ఇవ్వడంలేదు. గ్రామీణ విద్యార్థుల కోసం అందుబాటులో పాఠశాలలను ఏర్పాటు చేసినా కొన్నిచోట్ల అవి తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. విద్యార్థులుంటే టీచర్ల కొరత ఉండడం, ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థులు లేకపోవడం వంటి పాఠశాలలు మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో కనిపిస్తున్నాయి.*
*-ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31*



పాఠశాలకు హాజరైన ఒకే విద్యార్థిని, ఉపాధ్యాయురాలు

**మండలంలోని** హాజీపూర్ సడాక్‌తండా ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయురాలు ఉన్నారు. నాల్గో తరగతిలో ఉన్న విద్యార్థిని సభావట్ సింధు పాఠశాలకు వస్తుండగా, ఒకటో తరగతిలో ఉన్న సభావట్ మహేశ్వరి అప్పుడప్పుడు వస్తున్నది. సదరు బాలిక మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలి మనవరాలు కావడంతో ఆలస్యంగా వస్తున్నది. పాఠశాలలో ఇద్దరే విద్యార్థినులు ఉండడంతో ఏజెన్సీ నిర్వాహకురాలు సభావట్ షానుబాయి ఇంటి నుంచే భోజనం తీసుకువస్తున్నది. దీంతో పాఠశాలలోని కిచెన్, స్టోర్ గదులు నిరుపయోగంగా మారాయి. ఈ విషయమై ఉపాధ్యాయురాలు సుమలతను అడుగగా తాను ఆరు నెలల క్రితం బదిలీపై వచ్చానని, లింగంపేట్ నుంచి ప్రతిరోజూ పాఠశాలకు వస్తూ పోతుంటానని తెలిపారు. తాను వచ్చిన నుంచి ఇదే పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. గ్రామంలో ఇద్దరే పిల్లలు ఉన్నారా, మిగతా పిల్లలు ఎక్కడ చదువుకుంటున్నారు అని అడుగగా, గ్రామంలో ఇంకా పిల్లలు ఉన్నారని, సమీపంలోని హాజపూర్ గ్రామ పాఠశాలలో చదువుకుంటున్నారని తెలిపారు.

---

నేడు బాన్సువాడకు

# హైకోర్టు జడ్జిల రాక

**రెండు కోర్టు భవన నిర్మాణ పనులకు భూమిపూజ**

బాన్సువాడ, జనవరి 31: బాన్సువాడ పట్టణానికి శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జె. శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ అలిశెట్టి రానున్నారని బాన్సువాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ డివిజన్ కేంద్రంలో సుమారు రూ.23.67 కోట్లతో చేపట్టనున్న జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ రెండు కోర్టు భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

---

# ‘డబుల్’ కాలనీలో నీటి కష్టాలు!

- పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్
- నిలిచిపోయిన నీటి సరఫరా
- పంచాయతీ ట్యాంకర్ ద్వారా సప్లయ్
- పదేండ్ల క్రితం నాటి రోజులు మళ్లీ వచ్చాయంటూ కాలనీవాసుల ఆవేదన



ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

కోటగిరి, జనవరి 31: వేసవి కాలం రాకముందే గ్రామాల్లో నీటి కటకట మొదలైంది. పలు పల్లెల్లో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 30 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి, అర్హులైన పేదలకు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటి సౌకర్యం కల్పించారు. క్షేత్రపర్యటనలో భాగంగా ‘నమస్తే తెలంగాణ’ డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయాన్ని శుక్రవారం సందర్శించగా.. కాలనీవాసులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించింది. పంచాయతీ ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న దృశ్యం కనిపించింది. కొన్ని రోజుల నుంచి డబుల్ బెడ్‌రూం ఇండ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని కాలనీవాసులు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులను అడిగితే మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయిందని చెబుతున్నారని వాపోయారు. సింగిల్ ఫేస్ మోటరు ఉన్నప్పటికీ కొద్దిసేపు మాత్రమే నీళ్లు వస్తున్నాయని, అవికూడా నాలుగు ఇండ్లకు కూడా సరిపోతలేవన్నారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి వెంటనే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, కాలనీలో నాలుగు ఇండ్లకు ఒక కుళాయి ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

### భగీరథ నీళ్లు అస్తలేవు..



రాంపూర్ డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయానికి భగీరథ నీళ్లు అస్తలేవు. నీళ్ల సౌకర్యంలేక నెలకంటే ఎక్కువ రోజులవుతున్నది. పంచాయతీ వాళ్లు వేరే మోటరు నుంచి ట్యాంకర్ నింపుకొచ్చి కాలనీలో పెడుతున్నరు. కానీ ఇక్కడ బిందెలో నీళ్లు తీసుకొని డబుల్ బెడ్ రూంలోని పైన ఇంటిపైకి ఎక్కాలంటే కష్టంగా ఉన్నది.

**-నాగం మగెవ్వ, కాలనీవాసి, రాంపూర్, కోటగిరి మండలం**

### ఇంకా పరిష్కరించలే..



రాంపూర్ డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య ఉంది. మా కాలనీలో నల్లాలు ఏర్పాటుచేయాలి. భగీరథ నీళ్లు రాని రోజు మేము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నం. ఇప్పుడైన సార్లూ స్పందించి, మా సమస్యను పరిష్కరించాలి.

**- కళావతి, కాలనీవాసి, రాంపూర్, కోటగిరి మండలం**

### పైప్‌లైన్ ధ్వంసమైంది..



పైప్‌లైన్ పగలడంతో రాంపూర్‌కు భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో భగీరథ నీరు సరఫరా నిలిచిపోయింది. బోరు మోటరు ద్వారా ట్యాంకర్ నింపి డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సరఫరా చేస్తున్నాం.

**- హన్మంతరావు, కార్యదర్శి, రాంపూర్**

